క్లుప్తంగా

పది రోజులుగా 'భగీరథ' నీరు బంద్

దుమ్ముగూడెం: మండలంలోని గంగోలు నుంచి తూరుబాక వరకు గల గ్రామాల్లో గత పది రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు చేతిపంపులు, బోర్లు వంటి కలుషిత నీటిపై ఆధారపడుతున్నారు. లక్ష్మీనగరం నుంచి తూరుబాక వరకు గల మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ మధ్యలో సమస్య రావడంతో అయా గ్రామాలకు నీరు సరఫరా కావడం లేదు. సమస్యను గుర్తించి, పరిష్కరించడంతో మిషన్ భగీరథ అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ ఎఈ జాన్ హోనన్యను వివరణ కోరగా.. పైప్‌లైన్‌లో సమస్యను గుర్తించామని, బుర్రవేములా కల్వర్టు దగ్గర పైప్‌లైన్ లీకేజీ ఉందని తెలిపారు. అక్కడ చెరువు నీరు ఊట రావడం, వర్షాలు పడి నీరు ఎక్కువగా ఉండటంతో పనులు సాగడంలో ఇబ్బంది ఏర్పడిందని, ప్రస్తుతం వర్షాలు తగ్గిన నేపథ్యంలో పైప్‌లైన్‌ను పునరుద్ధరిస్తామని తెలిపారు.

హామీల అమలులో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

గుండాల: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలతో పాటు, 420 హామీలను ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో విఫలమైందని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరిగితే బాకీ పడ్డ సంక్షేమ పథకాలు అందించేలాగా ప్రతీ ఓటరు నిలదీయాలని సూచించారు. రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల నాయకులు తెల్లం భాస్కర్, రవీందర్ రెడ్డి, మోకాళ్ల వీరస్వామి, రాము, అజ్జు, నిట్ట రాములు, బుచ్చిరాములు, గడ్డం వీరన్న, తాటి కృష్ణ, నాగేశ్వరరావు, మల్లయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

లౌకికవాదులతో పొత్తులు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు బ్రహ్మాచారి

చర్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా కలిసొచ్చే వామపక్ష, ప్రజాతంత్ర, లౌకికవాద పార్టీలతో పొత్తులు కుదుర్చుకుంటామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలగాని బ్రహ్మాచారి వెల్లడించారు. సోమవారం చర్లలోని బీఎస్ రామయ్యభవన్‌లో పార్టీ మండల కార్యదర్శి మచ్చా రామారావు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని ఓడించడానికి కలిసొచ్చే వారినే పొత్తుకు అంగీకరిస్తామని, బీజేపీతో భాగస్వామిగా ఉండే ఏ పార్టీనీ అంగీకరించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు కారం నరేష్, బందెల చంటి, చంద్రం, హరినాగవర్మ, సమ్మక్క, వరలక్ష్మి పాల్గొన్నారు.

పెనాల్టీపై స్పష్టత ఇవ్వాలి

మణుగూరుటౌన్: కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించిన అపరాధ రుసుముపై సింగరేణి యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో ఎస్ఓటూ జీఎం శ్రీనివాసచారికి వినతిపత్రం అందజేశారు. సోమవారం జీఎం కార్యాలయ ఆవరణలో ఇఫ్టూ నాయకులు నాజర్‌పాషా మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులు అనారోగ్య లేదా మరే ఇతర అత్యవసర పరిస్థితుల కారణంగానైనా విధులకు గైర్హాజరైతే పెనాల్టీ విధించడం, అవి చెల్లిస్తేనే బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమ చేస్తమని కాంట్రాక్టర్లపై ఒత్తిడి తేవడం సరైంది కాదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు సాధనపల్లి రవి, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, భద్రం, నగేశ్, సాంబయ్య, లింగయ్య, వినోద్, కృష్ణ, కస్నా, సమ్మయ్య, వెంకటాచారి, తిరుపతి, కృష్ణ, శ్రీను, నాగరాజు, ఎల్లయ్య, రామాచారి, శివాజీ, సర్వేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి

గుండాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీలో నిలబడే అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సోలం సతీష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీలను అన్ని పంచాయతీల నుంచి బీజేపీ అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. అభ్యర్థుల గెలుపుకోసం కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ఇర్ప ప్రకాష్, కల్తి రాధాకృష్ణ, ఈసం రవీందర్, అశోక్, రమేష్, శేఖర్, క్రిష్ణ, నరేష్ పాల్గొన్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

- నాసిరకంగా కొనసాగుతున్న పనులు
- నాణ్యతపై నీలినీడలు
- ఆది నుంచీ అధికారుల తీరుపై విమర్శలే



అధికారుల పర్యవేక్షణ లేకుండా కొనసాగుతున్న డివైడర్ నిర్మాణ పనులు

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేట ప్రధాన సెంటర్‌లో నిర్మాణ దశలో ఉన్న డివైడర్ పనుల నాణ్యతపై, అధికారుల పర్యవేక్షణ కొరవడింది. నిర్మాణ పనుల్లో నాణ్యతపై మొదటి నుంచి కూడా స్థానికుల నుంచి పలు అభ్యంతరాలు వ్యక్తమవుతున్నప్పటికీ నాణ్యత పరిశీలన, పర్యవేక్షణలో అధికారుల పనితీరు మారట్లేదు. దమ్మపేట జయలక్ష్మి టాకీస్ నుంచి మందలపల్లి జంక్షన్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల పొడవు మేరకు ఆర్ అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న డివైడర్ నిర్మాణ పనులపై, గతంలో మందలపల్లి వాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానికుల నుంచి అభ్యంతరం, ఆందోళన వ్యక్తమైన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కూడా నిర్మాణ పనులను పరిశీలించి, నాణ్యతలో ఏమాత్రం లోపాలున్న సహించేది లేదని హెచ్చరించారు. అయినప్పటికీ పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తూ, నాణ్యతతో నిర్మాణం జరిగేలా చూడాల్సిన అధికారులు.. అటువైపు చూసిన పరిస్థితి లేదు.

కాంట్రాక్టర్‌దే ఇష్టారాజ్యం..

దమ్మపేట ప్రధాన సెంటర్‌లో డివైడర్ నిర్మాణ పనులు కొనసాగుతుండగా.. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, వారి కింద స్థాయి సిబ్బంది పనుల తీరును పరిశీలించడం లేదు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన ఏఈ కూడా ఇన్‌చార్జ్ అధికారి కావడంతో నిర్మాణ పనుల వద్ద కార్మికులు, కాంట్రాక్టర్‌కు సంబంధించిన సూపర్‌వైజర్ తప్ప ఎవరూ ఉండడం లేదు. ఈ కారణంగా నిర్మాణంలో నాణ్యత ఎంత మేరకు ఉంది అనే ప్రశ్న తలెత్తుతోంది. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా, నిబంధనలను అతిక్రమించి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు స్థానికుల నుంచి బలమైన వాదన వినిపిస్తోంది.

నాణ్యతా లోపం ఇలా..

డివైడర్ నిర్మాణ పనుల్లో ఉపయోగించే సిమెంట్, ఇసుక కలసిన మిశ్రమం, కాంక్రీట్ మిశ్రమంలో నిర్దేశిత ప్రమాణాలను ఉండాలి. కానీ ఇక్కడ అలా లేదని తెలుస్తోంది. డివైడర్ నిర్మాణంలో వినియోగించే సిమెంట్, ఇసుక, కంకర, ఫ్లైయాష్‌లతో కూడిన కాంక్రీట్ మిశ్రమంలో నిర్దేశిత ప్రమాణాల కంటే ఇసుక, ఫ్లైయాష్‌లను అధిక మొత్తంలో కలిపి సిమెంటు, కంకరలను తక్కువ మొత్తంలో కలుపుతున్నారని, రాయి కట్టడానికి వినియోగించే సిమెంట్ మిశ్రమంలో ఒక 50 కేజీల సిమెంట్ బస్తాకు, 25 బాల్చాలకు పైగా ఇసుకను కలుపుతున్నారని స్థానికులు చెపుతున్నారు. కట్టడానికి వినియోగించే ఇసుక నాణ్యత కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఇలా నిర్దేశిత ప్రమాణాలను పాటించకుండా నిర్మిస్తున్న డివైడర్ నాణ్యత పట్ల పలువురు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

లోపాలు లేకుండా చూస్తాం..

డివైడర్ నిర్మాణ పనుల నాణ్యతలో లోపాలు లేకుండా చూస్తాం. సిబ్బంది కొరత, ఇన్‌చార్జ్ ఏఈ కారణంగా డివైడర్ నిర్మాణ పనులను, వీలైన సమయంలో నేనే పర్యవేక్షిస్తున్నా. కాంక్రీట్ మిశ్రమం, తదితర నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలు ఉంటే, కాంట్రాక్టర్‌కు చెప్పి, సరిచేయిస్తాం.

– ఆర్‌అండ్‌బీ డీఈ ప్రకాష్

పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ



స్టేషన్ ఆవరణను పరిశీలిస్తున్న పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్

అశ్వారావుపేటరూరల్: స్థానిక పోలీస్ స్టేషన్‌ను సోమవారం పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌లో రికార్డు గది, కంప్యూటర్ విభాగం, స్టేషన్ ఆవరణను పరిశీలించారు. ఆ తర్వాత రికార్డులు తనిఖీ చేసి గడిచిన ఏడాది కాలంలో నమోదు చేసిన కేసులు, వాటి పురోగతి, ఇతర వివరాలను సిబ్బందిను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సరిహద్దు ప్రాంతం కావడంతో చోరీలు, స్మగ్లింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే నేరాల నియంత్రణ, శాంతిభద్రతలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ పింగిళి నాగరాజు, ఎస్సైలు యయాతీ రాజు, రామ్మూర్తి, అఖిల, ఇతర సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

చంద్రుగొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న అభివృద్ధి పనులను జిల్లా సమ్మిళిత విద్యాశాఖ కోఆర్డినేటర్ ఎస్‌కె.సైదులు సోమవారం పరిశీలించారు. తిప్పనపల్లి, సుంకర బంజర్ గ్రామాల్లోని దివ్యాంగుల మరుగుదొడ్ల నిర్మాణాలను, చంద్రుగొండలోని భవిత కేంద్రం నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎస్.సతీష్‌కుమార్, ఏఈ రాంకుమార్, వివిధ పాఠశాలల కాంప్లెక్స్ ఉపాధ్యాయులు వై.ఉప్పల్ రెడ్డి, ఐఈఆర్ పీఎస్ శుభకర్, స్పెషల్ ఎడ్యుకేటర్ సురేష్ బాబు, సీఆర్పీ సేవ్యా, సూపర్ వైజర్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విద్యాశాఖ కోఆర్డినేటర్ సైదులు

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మహాలక్ష్మి

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని రాజకీయ పార్టీల నాయకులను ఎంపీడీఓ మహాలక్ష్మి కోరారు. వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. ఎన్నికల నియమావళి, రిజర్వేషన్ల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు వనమా గాంధీ, జంగిలి వెంకటరత్నం, పానుగంటి రామారావు, చెన్నారావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో ధ్యాన ఉత్సవం



యోగా అభ్యసిస్తున్న కళాశాల విద్యార్థులు

అశ్వారావుపేట: అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో సోమవారం ధ్యాన్ ఉత్సవాల్లో భాగంగా యోగముద్రలు, జుంబా డాన్స్‌లను విద్యార్థులకు నేర్పించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి.హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు డి.స్రవంతి, డాక్టర్ పి.ఝాన్సీ, డాక్టర్ రవికుమార్ పర్యవేక్షించారు.

క్రీడాకారుడికి ఎమ్మెల్యే అభినందన



దమ్మపేట: అభినందన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వాలీబాల్ క్రీడాకారులు

అశ్వారావుపేటరూరల్: క్రీడా రంగంలో రాష్ట్రస్థాయిలో రాణించిన ఓ గిరిజన క్రీడాకారుడిని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలోని కావడిగుండ్ల గ్రామానికి చెందిన ఎస్.సోమరాజు గడిచిన ఆగస్టు నెలలో వరంగల్ జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పురుషుల విభాగంలో లాంగ్, ట్రిబుల్ జంప్ పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ నేపథ్యంలో దమ్మపేట మండలం గండుగులపల్లిలోని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణను క్యాంప్ కార్యాలయంలో కలిశాడు. ఎమ్మెల్యే సోమరాజును అభినందించి, రూ.5వేల విలువైన స్పోర్ట్స్ కిట్‌ను ఉచితంగా అందించారు.

కాంగ్రెస్ నాయకుల అభినందన

దమ్మపేట: జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను, స్థానిక నాయకులు సోమవారం అభినందించారు. దసరా పండగను పురస్కరించుకొని మండలంలోని రాచూరుపల్లి గ్రామంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా, ఏపీలోని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని పార్కలగండి గ్రామానికి చెందిన జట్టు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి మూడో స్థానంలో నిలిచింది. ఈ మేరకు నిర్వాహకులు వారికి ఛాంపియన్ కప్పును అందజేశారు. ఈ సందర్భంగా జట్టు క్రీడాకారులను కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు, కొర్సాసాగర్, పంచాయతీ కార్యదర్శి సుజాత, గ్రామ పెద్దలు, తదితరులు అభినందనలు తెలియజేశారు.

మున్సిపల్ ఫిర్యాదులకు నంబర్ ఏర్పాటు

అశ్వారావుపేట: అశ్వారావుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేక నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ బి.నాగరాజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీలో ప్రజలకు ఉత్పన్నమయ్యే సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు నేరుగా కార్యాలయానికి వచ్చి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండా ఒక మొబైల్ నంబర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ ప్రజలు వారి సమస్యలపై 6309318976 నంబరుకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తాగునీరు, శానిటైజేషన్, ఎలక్ట్రిసిటీ తదితర సమస్యలపై ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. సమస్య తీవ్రతను బట్టి వారం రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించండి

మణుగూరురూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల పరిధిలోని తిర్లాపురం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం, సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు కొడిశాల రాములు, దామల్ల వెంకన్న, మడి నర్సింహరావు, తాటి నర్సింహరావు, శంకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంతాపం..

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయితీకి చెందిన సింగరేణి ఉద్యోగి, సీపీఐ సీనియర్ కార్యకర్త మారపాక శంకర్ గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న సిపిఐ నాయకులు జక్కుల రాజబాబు, అదెర్ల రాములు, ఎస్‌కె.సర్వర్‌లు సోమవారం వారి గృహానికి వెళ్లి శంకర్ భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో నాయకులు మంగి వీరయ్య, వంగా పాపయ్య, నాగేశ్వరరావు, శంకర్, గంగయ్య తదితరులు ఉన్నారు.

ఆదివాసీలు సత్తా చాటాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

ములకలపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆదివాసీలు సత్తా చాటాలని ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ దొర పిలుపునిచ్చారు. ములకలపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఏజన్సీ ప్రాంతంలో పీసా చట్టానికి అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. ఆదివాసీ జేఏసీ జిల్లా నాయకులు కోంద్రు సుందర్ రావు, సంఘ రాష్ట్ర నాయకులు సోయం సత్యనారాయణ, జీఎస్ఎస్ రాష్ట్ర నాయకులు ఆరెం ప్రశాంత్, కొర్సా ప్రసాద్ పాల్గొన్నారు.

కష్టపడిన కార్యకర్తలకే అవకాశం



దరఖాస్తులు స్వీకరిస్తున్న పొదెం వీరయ్య, పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్/భద్రాచలంటౌన్: కనీసం ఐదేళ్లుగా పార్టీలో సేవలు అందిస్తున్న వారికి, యువతకు ప్రాధాన్యత ఇస్తూ స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను ఎంపిక చేస్తామని, పార్టీ నిర్ణయమే సుప్రీం అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావులు అన్నారు. సోమవారం మణుగూరు, భద్రాచలంలలో నిర్వహించిన నియోజకవర్గాల ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. విభేదాలుంటే పరిష్కరించుకుందామని, పార్టీ అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపిద్దామని అన్నారు. కార్యకర్తలు సమష్టి కృషితో పార్టీ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని సూచించారు. అనంతరం ఆశావహులు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడికి దరఖాస్తులు అందజేశారు. ఈ సమావేశంలో నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, నాగ సీతారాములు, మోతుకూరి ధర్మారావు, చందా లింగయ్య దొర, తోట ప్రసన్న, జిల్లా పసుపులేటి వీరబాబు, ఏలూరి కోటేశ్వరరావు, మహ్మద్ ఖాన్, చందా సంతోష్, చంద్రశేఖర్, కాటబోయిన నాగేశ్వరరావు, బీరం సుధాకర్‌రెడ్డి, తరుణ్‌రెడ్డి, ముత్తినేని సుజాత, తుక్కాని మధుసూదన్‌రెడ్డి, వత్సవాయి కృష్ణంరాజు, నల్లపు దుర్గాప్రసాద్, రవి కుమార్, బుడగం శ్రీనివాస్, సుధీర్, ప్రదీప్, శ్రీనివాసరావు, వినీల్, విజయభాస్కర్ రెడ్డి, లంక శ్రీనివాసరావు, నరేష్, శ్రీనివాసరావు, ఇర్ప శాంత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి రూ.44 లక్షల ఆదాయం

భద్రాచలంఅర్బన్: బతుకమ్మ, విజయదశమి పండుగల సందర్భంగా 9 రోజులపాటు నడిపిన భద్రాచలం డిపో ఆర్టీసీ సర్వీసులకు రూ.44 లక్షల ఆదాయం చేకూరింది. భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ జంగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 27 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు రోజువారిగా నడిచే బస్సు సర్వీసులకు అదనంగా ఖమ్మం, హైదరాబాద్ వంటి నగరాలకు మొత్తం 8 సర్వీసులు నడిపించారు. రోజువారీగా రెండు తెలుగు రాష్ట్రాలకు నడిచే సర్వీసులకుగాను సుమారు రూ.21.22 లక్షల ఆదాయం వస్తుండగా.. అదనపు సర్వీసులతో రోజులకు రూ.5 లక్షల అదనపు ఆదాయం చేకూరింది. మొత్తంగా ఆ లెక్క రూ.44లక్షలకు చేరింది. మరోవైపు, పండుగ సెలవులు పూర్తి కావడంతో ఆదివారం, సోమవారం భద్రాచలం ఆర్టీసీ బస్‌స్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ఆర్టీసీ బస్సులో ఏదైన సమస్య ఎదురైతే వెంటనే 9959225960, 7382858084, 9959225987 నంబర్లను సంప్రదించాలని డీఎం జంగయ్య తెలిపారు.

స్తంభం చుట్టూ చెట్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

దుమ్ముగూడెం: స్తంభం చుట్టూ అల్లుకుపోయిన చెట్లను విద్యుత్ సిబ్బంది సోమవారం తొలగించారు. మండలంలోని బండిరేవు గ్రామంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ ఇంటికి వెళ్లే రహదారిలో ఉన్న విద్యుత్ స్తంభం చుట్టూ చెట్లు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారిందని 'సాక్షి'లో 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' అను శీర్షికన ప్రచురించిన విషయం తెలిసిందే. స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ మోహన్‌రెడ్డి విద్యుత్ సిబ్బందితో స్తంభం చుట్టూ అల్లుకుపోయిన చెట్లను పూర్తిగా తొలగించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ఆలయం వద్ద ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

గుండాల: శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం మండల కేంద్రంలో మూడు రోజుల పాటు కొనసాగింది. పూజారులు కేతముక్కల పవన్ కుమార్ శర్మ, శ్రీరంగం సనత్ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం యంత్ర ప్రతిష్ఠ, శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్మాణ దాతలు పోలు కనకయ్య-రాజేశ్వరి, పోలు రమేష్-రేణుక, రిత్విక్, నాగరోహిత్, ఆలయ కమిటీ సభ్యులు పట్వారి వెంకన్న, యసారపు సురేష్, కోడూరి శ్యాం, మానాలా వెంకటేశ్వర్లు, గుండెబోయిన లక్ష్మీనారాయణ, గడ్డం సాయి, పిల్లి కృష్ణ, యాసారపు రవి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీకి వినతిపత్రం



ఎంపీ రఘురాం రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ పాస్టర్లు

దమ్మపేట: క్రైస్తవుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమవారం కొత్తగూడెంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో, ఎంపీ రఘురాం రెడ్డిని ఆదివాసీ పాస్టర్స్ మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలు వివరించగా.. ఎంపీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆదివాసీ పాస్టర్స్ మడివి ఎలీషా, బిజ్జా రవిబాబు, సింగయ్య, ప్రసాద్, కాకా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

దమ్మపేట: నేత్రదానం చేసిన గండుగులపల్లి గ్రామానికి చెందిన కోటగిరి లోలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే జారే పూలతో నివాళులర్పించారు. ఆమె నేత్రాలను దానం చేయాలని నిర్ణయం తీసుకోవడం చాలా గొప్ప విషయం అన్నారు.

రోడ్డెక్కిన పబ్లిసిటీ బోర్డులు

- పార్కింగ్ ప్రదేశాల్లోనూ ఏర్పాటు
- వాహనాలు నిలిపేందుకు స్థలం కరువు



పార్కింగ్ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన వ్యాపార బోర్డులు

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉండే పార్కింగ్ స్థలాలు కూడా వ్యాపారుల ప్రకటన బోర్డులతో, అద్దెలకిస్తున్న చిరు వ్యాపారులతో రద్దీగా మారుతోంది. దీంతో ఆయా వ్యాపార కేంద్రాలకు, బ్యాంకు వంటి సముదాయాలకు వచ్చే వినియోగదారుల వాహనాలు రోడ్లపైనే నిలుపుతున్నారు. ప్రధాన రహదారి అయినప్పటికీ ఒక వాహనం పక్కన మరో వాహనం వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. అంతేకాకుండా పార్కింగ్ స్థలం పబ్లిసిటీకే సరిపోవడంతో అక్కడకు వచ్చే వినియోగదారులు పోలీసుల ఫైన్లకు ఇక్కట్లు పడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి మార్కెట్‌కు రావాలంటేనే వినియోగదారులు జంకుతున్నారు.

ఆక్రమణలు.. ఆపై ఆదాయ మార్గాలు..

దుకాణాలు ప్రధాన రోడ్డుకు దూరంగా ఉన్నప్పటికీ సైడ్ కాల్వలపై తమ సామగ్రిని ఉంచి మరీ పబ్లిసిటీ చేస్తూ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మరికొందరు మున్సిపాలిటీ చెత్త సేకరించేందుకు వీలు లేకుండా కాల్వలపైనే తమ స్థలంలా సిమెంట్ పనులు చేయించుకుంటున్నారు. అంతేకాకుండా తమ దుకాణాల ముందర వ్యాపారాలు నిర్వహించుకునేందుకు తోపుడుబండ్లకు, బజ్జీలు, సమోసా, పాలు, కూరగాయలు, టీ వ్యాపారులతో పాటు దుకాణాలకు రోజుకు కొంత చొప్పున డబ్బు వసూలు చేసుకుంటూ అదనపు ఆదాయానికి దారులు వేసుకుంటున్నారు. దీంతో అసలు వ్యాపార కేంద్రాలకు వచ్చే వినియోగదారులు రోడ్లపైనే వాహనాలు నిలిపి ఉంచాల్సిన దుస్థితి నెలకొంటోంది. దుకాణాదారులే కాల్వలను ఆక్రమించి వ్యాపారం నిర్వహిస్తూ.. తమ దుకాణాల ముందర చిరు వ్యాపారులకు అద్దెకు ఇవ్వడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నోటీసులతో సరి..

కాల్వలే ఆక్రమించరాదని అధికారులు అవగాహన కల్పిస్తున్నా.. వాటిపై సామగ్రి ఉంచి కాల్వ పూడిక తీయకుండా కొందరు వ్యాపారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అడ్డగోలుగా పార్కింగ్ స్థలాల్లో హోర్డింగులు, పబ్లిసిటీ బోర్డులు డ్రెయినేజీలను ఆక్రమించి ఏర్పాటు చేస్తున్నప్పటికీ మున్సిపాలిటీ అధికారులు నోటీసులతో సరిపెడుతున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో పోలీసులు ప్రధాన రహదారిపై రోడ్డుపై తిరుగుతూ.. పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డులు తొలిగించి వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేసిన సంఘటనలున్నాయి. అయినా కొందరు తమ వ్యాపారాల కోసం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లపై, పార్కింగ్ స్థలాల్లో పబ్లిసిటీ కోసం పెట్టే బోర్డులను తొలిగించాలని పార్కింగ్ స్థలాలను రోజు అద్దెలకిచ్చే దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

అవగాహన కల్పించాం..

ప్రధాన రహదారిపై పార్కింగ్ స్థలాల్లో చిరువ్యాపారులకు అద్దెకివ్వొద్దని వ్యాపారులకు సూచించాం. చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి సూచనలిచ్చాం. అయినా కాల్వలపైన, పార్కింగ్ స్థలాల్లో హోర్డింగ్‌లు పెట్టి వ్యాపార ప్రకటనలకు వినియోగిస్తున్నారు. కొందరు వ్యాపారులు పార్కింగ్ స్థలాలపై, సైడ్ కాల్వలపై సామగ్రిని ఉంచి వ్యాపారమే నిర్వహిస్తున్నారు. నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం.

– భాస్కర్, టీపీఓ, మణుగూరు